
కిడ్నీ బాధితులకు ఊరట కలిగేనా!

● రాష్ట్రంలో కొత్తగా శస్త్రచికిత్స కేంద్రాలు
● ఉమ్మడి జిల్లాలో ఏర్పాటుకు ఎదురుచూపులు





పెద్దపల్లి జిల్లాసుపత్రి డయాలసిస్ విభాగంలో చికిత్స పొందుతున్న రోగులు

ఈనాడు, పెద్దపల్లి, న్యూస్‌టుడే గోదావరిఖని పట్టణం

కిడ్నీ రోగులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రక్తనాళాల శస్త్రచికిత్స(వాస్క్యులర్ సర్జరీ), డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేయనుండటంతో ఆశలు చిగురిస్తున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 12 ప్రభుత్వాసుపత్రుల్లో డయాలసిస్ కేంద్రాలు ఉండగా.. 150 పడకల వరకు అందుబాటులో ఉన్నాయి. దాదాపు 11,250 మంది రోగులు చికిత్స పొందుతున్నారు. ఈ ఆసుపత్రుల్లో ఎక్కడా ప్రత్యేక వాస్క్యులర్ సర్జన్లు లేరు. నెఫ్రాలజిస్టు స్పెషలిస్టులు సైతం అందుబాటులో లేరు. కేవలం రోగులకు డయాలసిస్ యంత్రాల ద్వారా రక్తశుద్ధీకరణ మాత్రమే జరుగుతోందని వైద్యులు చెబుతున్నారు.


ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డయాలసిస్ కేంద్రాలు-రోగుల వివరాలు

జిల్లా	ఆసుపత్రులు	పడకలు	రోగుల సంఖ్య
కరీంనగర్	4	45	5,210
పెద్దపల్లి	3	15	2,120
జగిత్యాల	3	50	2,450
సిరిసిల్ల	2	40	1,470

గాంధీ, నిమ్స్‌కు వెళ్లాల్సిందే..

కిడ్నీ బాధితులకు తొలిసారి రక్తశుద్ధి చేయాల్సి వచ్చినప్పుడు డయాలసిస్ యాక్సెస్ పాయింట్ ఏర్పాటుకు వాస్క్యులర్ సర్జరీ అవసరమవుతుంది. శరీరంలోని రక్తాన్ని 4 గంటలపాటు అన్ని అవయవాలకు ప్రవహించేలా ఈ శస్త్రచికిత్స చేస్తారు. ఇలాంటి చికిత్సలు హైదరాబాద్‌లోని గాంధీ, నిమ్స్ ప్రభుత్వాసుపత్రుల్లో మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీంతో కిడ్నీ వ్యాధిగ్రస్తులు వ్యయ ప్రయాసలతో హైదరాబాద్‌కు వెళ్లి చేయించుకోవాల్సి వస్తుంది. చికిత్స అనంతరం ఆయా జిల్లాల్లోని డయాలసిస్ కేంద్రాల ప్రభుత్వాసుపత్రుల్లో ఉచితంగా రెండు రోజులకొకసారి 4 గంటలపాటు రక్తం శుద్ధి చేసుకుంటున్నారు.

రక్త శుద్ధీకరణ ఇలా..



✦ మధుమేహం, మద్యపానం, జన్యుపరమైన లోపాల మూలంగా మూత్రపిండాల సమస్యలతో బాధపడుతున్నవారి సంఖ్య పెరుగుతోంది. రక్తశుద్ధీకరణ సాఫీగా జరగకపోవడంతో ప్రాణాప్రాయ పరిస్థితులకు రోగి చేరుకునే అవకాశం ఉంటుంది. దీంతో వెంటనే డయాలసిస్ చేయాల్సి ఉంటుంది. గుండెకు తీసుకెళ్లే, తీసుకొచ్చే రక్తనాళాల మార్గాన్ని కలుపుతూ శస్త్రచికిత్స చేసి.. రక్తం శుద్ధిచేసే పైపులకు అనుసంధానం చేస్తారు. తద్వారా రోగి రెండు రోజులకొకసారి డయాలసిస్ చేసుకోవాల్సి ఉంటుంది. హృదయ స్పందన సజావుగా సాగేందుకు.. ధమనులు, సిరలకు రక్త శుద్ధీకరణ సాఫీగా జరిగేందుకు యంత్రాల ద్వారా పర్యవేక్షణ చేస్తారు.

✦ కిడ్నీలకు వెళ్లే రక్తనాళాలకు సమస్యలుంటే మోచేయి కింద మణికట్టుకుపైన శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఏ ప్రభుత్వాసుపత్రులోనూ ప్రత్యేకంగా వాస్క్యులరీ సర్జన్లు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

✦ ఎండో వాస్క్యులరీ సిస్టం వంటి అత్యాధునిక రక్తనాళాల శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నప్పటికీ.. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో ఈ సేవలు రోగులకు అందడం లేదు. ప్రత్యేకంగా కిడ్నీ వైద్య నిపుణులు(నెఫ్రాలజిస్టులు) కూడా అందుబాటులో లేరు. అన్ని డయాలసిస్ కేంద్రాల్లోనూ కేవలం యంత్రాల టెక్నీషియన్లు, నర్సులు, ఇతర సిబ్బంది తప్ప వైద్య చికిత్స అందించేందుకు ప్రత్యేకంగా కిడ్నీ వైద్య నిపుణులు అందుబాటులో లేరు.

నేడు కలెక్టరేట్ ముందు ధర్నా

పెద్దపల్లి కలెక్టరేట్: గ్రామ పంచాయతీల్లోని పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. మల్టీవర్కర్ విధానం రద్దు తదితర సమస్యలపై ఆందోళన చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని పారిశుద్ధ్య కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

వంటింటి నుంచి వ్యాపారంలోకి!

● ‘ఇందిరా మహిళా శక్తి’కి ఆదరణ
● వ్యాపారవేత్తలుగా రాణించేందుకు ఆసక్తి

న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం

స్వయం ఉపాధి రంగంలో మహిళలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ‘ఇందిరా మహిళా శక్తి’ పథకాన్ని అందిపుచ్చుకొని.. పలువురు మహిళలు వ్యాపార రంగంలో ముందడుగు వేస్తున్నారు. వీరిని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రోత్సహిస్తుండటంతో.. వారు ఎంచుకున్న వ్యాపారానికి సంబంధించిన నివేదికలు సిద్ధం చేయడంతో పాటు ‘ఇందిరా మహిళా శక్తి’లో రుణాలు ఇప్పిస్తుంది. కేవలం పొదుపులకే పరిమితమైన స్వశక్తి మహిళలు ఇప్పుడు వ్యాపారవేత్తలుగా రాణించేందుకు పునాదులు వేసుకుంటున్నారు.



కర్రీ పాయింట్‌తో ఉపాధి పొందుతున్న మహిళలు

రుచికరమైన వంటలతో..

ప్రస్తుతం నగరంలో ఎక్కడ చూసినా కర్రీ పాయింట్ల నిర్వహణ జోరుగా సాగుతుంది. ఇదే తరుణంలో అత్యంత రుచికరంగా వంటచేసే తాను.. కర్రీ పాయింటుతోనే ఉపాధి పొందాలనుకుంది గోదావరిఖని రమేశ్‌నగర్‌కు చెందిన ఉమారాణి. టైలరింగ్‌తోపాటు చీరల విక్రయంతో కుటుంబానికి బాసటగా నిలుస్తున్నారు. ఈ క్రమంలో ఇందిరా మహిళా శక్తి గురించి తెలుసుకొని.. రూ.లక్ష రుణంతో కర్రీ పాయింట్‌తోపాటు చపాతీలు చేసి విక్రయిస్తున్నారు. దీనికి తోడుగా సీజనల్‌గా పచ్చళ్లు సిద్ధంచేసి అమ్ముతున్నారు.

బిర్యానీ కేంద్రంతో ఉపాధి...

సాధారణంగా ఇంట్లో బిర్యానితోపాటు వివిధ రకాల ఆహార పదార్థాలను తయారుచేసే మహిళలు.. అదే వేదికగా వ్యాపార ఏర్పాటుకు సంకల్పించారు. గోదావరిఖని అశోక్‌నగర్‌కు చెందిన సానియా స్వశక్తి సంఘం సభ్యులు ‘ఇందిరా మహిళా శక్తి’ రుణం రూ. 10 లక్షలతో కూడలిలో బిర్యాని కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో 10 మంది మహిళలు ఉపాధి పొందుతుండటంతోపాటు ప్రతి నెలా రూ.30వేల చొప్పున వాయిదాలను చెల్లిస్తున్నారు.

సంయుక్తంగా 11 సంఘాలు..

కూరగాయలు, కిరాణం, కర్రీ పాయింట్లు, బ్యూటీపార్లర్లు, ఫ్యాన్సీ స్టోర్లు, కంగన్‌హాళ్లు తదితర వాటిని నిర్వహిస్తూ ఆర్థిక, సామాజికాభివృద్ధిలో మహిళలు రాణిస్తున్నారు. రామగుండం నగరపాలక ప్రాంతంలో ఇప్పటివరకు ఇందిరా మహిళా శక్తిలో 11 స్వశక్తి సంఘాలు సంయుక్తంగా వ్యాపారాలు నిర్వహిస్తుండగా.. వ్యక్తిగతంగా 58 మంది రాణిస్తున్నారు. ఆయా స్వశక్తి సంఘాల ఆర్పీలు వీరికి ఎప్పటికప్పుడు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తున్నారు.

శుభకార్యాలే వేదికగా..

వివాహమైనా, గృహ ప్రవేశమైనా ముందుగా గుర్తుకు వచ్చేది ఐరేని, బోనాల కుండలు. కుండల తయారీ వృత్తి కనుమరుగవుతున్న తరుణంలో.. ఇతర ప్రాంతాల నుంచి తెప్పించి ఉపాధి పొందుతున్నారు గోదావరిఖనిలోని తిలక్‌నగర్‌కు చెందిన కోట సంయుక్త. ఇందిరా మహిళా శక్తిలో రూ.లక్ష రుణంతో కుండల వ్యాపారాన్ని వృద్ధి చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు. ఒక్కో వివాహానికి కుండల డిజైన్ల ఆధారంగా రూ.5వేల వరకు పలుకుతుంది.



కుండలకు రంగులు దిద్దుతున్న సంయుక్త

మడిపల్లిలో సందడి చేసిన తమన్నా

కాల్వశ్రీరాంపూర్, న్యూస్‌టుడే: మండలంలోని మడిపల్లి గ్రామ శివారులో ప్రముఖ హీరోయిన్ తమన్నా ఆదివారం సందడి చేశారు. ఆమె ప్రధాన భూమిక పోషిస్తూ.. డైరెక్టర్ సంపత్ నంది తెరకెక్కిస్తున్న ‘ఓదెల 2’ సినిమా మడిపల్లిలోని హుస్సేన్మియా వాగు ఒడ్డున చిత్రీకరించారు. శివలింగానికి అభిషేకం చేసే సీన్‌లో తమన్నా నటించారు. దర్శకుడు సంపత్‌నంది పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రానికి చెందిన వారు కావడంతో ఓదెల మాజీ సర్పంచి మహేందర్, మున్నూరు కాపు రాష్ట్ర యూత్ కన్వీనర్ ఆకుల వివేక్ ఆయను శాలువాలతో సన్మానించారు.



మడిపల్లిలో తమన్నాతో యూనిట్ బృందం సభ్యులు

చిరు వ్యాపారాలకు అడ్డాగా..

జిల్లా కేంద్రంలోని ఆస్పత్రి సమీపంలో ప్రయాణికుల కోసం స్వచ్ఛంద సంస్థలు నిర్మించిన బస్‌షెల్టర్ ముందు చిరు వ్యాపారాలు సాగిస్తుండటంతో బస్సులు ఇక్కడ ఆగే పరిస్థితి లేదు. ఎక్కాలన్నా.. దిగాలన్నా.. అయ్యప్ప ఆలయం వరకు వెళ్లాల్సిందే. అయ్యప్ప కూడలిలో కూడా సిగ్నల్స్ పడితే ఒకచోట.. లేదంటే మరోచోట బస్సులను ఆపుతుండడంతో ప్రయాణికులు పరుగులు పెట్టాల్సి వస్తుంది. రద్దీ ఉండే కమాన్ ప్రాంతంలో బస్‌షెల్టర్లు లేక వ్యాపార సంస్థల ముందే ప్రయాణికులు నిలబడాల్సి వస్తుంది.



వారసంత నిర్వహణ



ఓదెల మండల కేంద్రంలో గత 25 ఏళ్ల రూ. 5లక్షలతో ప్రయాణ ప్రాంగణాన్ని నిర్మించారు. అప్పటి నుంచి నేటి వరకు అక్కడికి ఒక్క బస్సు పోయింది లేదు. గ్రామంలో రోడ్లు ఇరుకుగా, ప్రయాణ ప్రాంగణం చివరన ఉండటంతో అటువైపు ప్రయాణికులెవరు వెళ్లే పరిస్థితి లేక నిరుపయోగంగా మారింది. ప్రయాణ ప్రాంగణంలో ప్రస్తుతం ప్రతి గురువారం వారసంత నిర్వహిస్తున్నారు.

ప్రయాణ ప్రాంగణాలకు వెళ్లని బస్సులు

న్యూస్‌టుడే, ఓదెల, సుల్తానాబాద్, పెద్దపల్లి

ప్రయాణికులను ఎండ, వర్షం నుంచి రక్షించడానికి నిర్మించిన ఆర్టీసీ ప్రాంగణాలు గ్రామీణ ప్రాంతాల్లో అలంకారప్రాయంగా మారాయి. పట్టణాల్లో నిర్మించిన షెల్టర్లలో వ్యాపారులు సాగిస్తుండటంతో రోడ్లపైనే ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్టీసీ అధికారులు సైతం వీటిని విస్మరించడంతో నిరుపయోగంగా మారుతున్నాయి. స్థానికుల పట్టుదలతో పదేళ్ల క్రితం నిర్మించిన జూలపల్లి ప్రాంగణం ఇటీవల వినియోగంలోకి వచ్చింది. ఇలా మిగతా ప్రాంతాల్లోని వాటిని కూడా అధికారులు వినియోగంలోకి తేవాలి.

ఆగని సూపర్ లగ్జరీ బస్సులు

సుల్తానాబాద్ ప్రయాణ ప్రాంగణంలోకి మంచిర్యాల, ఆసిఫాబాద్ డిపోలకు చెందిన సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సులు.. సాయంత్రం 7 తర్వాత గోదావరిఖని, కరీంనగర్, మంథని డిపోల బస్సులు వెళ్లడం లేదు. మహాలక్ష్మి పథకం కారణంగా సుల్తానాబాద్‌లో లగ్జరీ, డీలక్స్ బస్సులు ఆపకుండా వెళ్తున్నారు. కరీంనగర్ నుంచి వచ్చే బస్సుల్లో కొంతమంది డ్రైవర్లు సుల్తానాబాద్‌లో దిగే ప్రయాణికులకు పెద్దపల్లి టికెట్ కొడుతున్నారు.

పదేళ్ల నుంచి ప్రారంభించలేదు

కాల్వశ్రీరాంపూర్‌లో పదేళ్ల క్రితం నిర్మించిన బస్‌స్టేషన్‌ను ఇప్పటి వరకు ప్రారంభించలేదు. ప్రయాణికులు రోడ్డుపైనే బస్సుల కోసం వేచి చూస్తున్నారు. ప్రస్తుతం బస్సులు ఆగే చోటు నుంచి 100 మీటర్ల దూరంలోనే బస్‌స్టేషన్ ఉన్నప్పటికీ వినియోగంలోకి తీసుకురావటంలో అధికారులు, నాయకులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. దీంతో ప్రయాణ ప్రాంగణం పశువులకు ఆవాసంగా మారింది.



వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు

మండల కేంద్రాల్లో నిర్మించిన బస్‌స్టేషన్లను వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతాం. ఆయా డిపోల మేనేజర్లతో మాట్లాడి.. బస్‌స్టేషన్‌లకు బస్సులు వెళ్లేలా ఆదేశలిస్తాను. సుల్తానాబాద్‌లో లగ్జరీ బస్సులు ఆపేందుకు చర్యలు తీసుకుంటాను.

- సుచరిత, ఆర్టీసీ ఆర్‌ఎం

10లోగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పరిష్కరించాలి

పెద్దపల్లి, న్యూస్‌టుడే: గ్రామపంచాయతీలకు వచ్చిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను ఈ నెల 10లోగా పరిష్కరించాలని జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య అన్నారు. పెద్దపల్లి మండలం అప్పన్నపేట, పెద్దకల్వల గ్రామాల్లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ.. ఎల్‌ఆర్‌ఎస్‌కు సంబంధించి అవసరమైన దస్త్రాలను ఇవ్వని వాటిపై ప్రత్యేకంగా నివేదిక తయారు చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వాహణకు ప్రాధాన్యత ఇవ్వాలని, సెగ్రిగేషన్ షెడ్లను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి శ్రీలత తదితరులు ఉన్నారు.



క్రమబద్ధీకరణకు ఛాయాచిత్రం తీసుకుంటున్న అధికారులు

వాటాల లెక్క తేలింది.. వారికే సింహభాగం

భూగర్భ గని కార్మికులకు ప్రతి మస్టరుపై రూ.771.11 ● సింగరేణి ఉద్యోగులకు నేడు పంపిణీ

న్యూస్‌టుడే, గోదావరిఖని

సింగరేణి కార్మికులకు చెల్లించే లాభాల వాటా లెక్క తేలింది. ఎవరికి ఎంత చెల్లించాలన్నది యాజమాన్యం నివేదిక తయారు చేసింది. కార్మికులకు సోమవారం పంపిణీ చేయనున్న వాటాను వారి పనిదినాల ఆధారంగా పంపిణీ చేయనుంది. అందులో భూగర్భ, ఉపరితల గనులు, విభాగాల వారిగా ఒక హాజరుకు ఎంత చెల్లించాలన్నది నిర్ణయించింది.

85 శాతం పని దినాలపైనే..

కార్మికులకు చెల్లించే రూ.796 కోట్లలో 85 శాతం గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఉద్యోగులు చేసిన పనిదినాల ఆధారంగా లెక్కించి పంపిణీ చేయనున్నారు. దీంతో హాజరుపై రూ.679.03 కోట్లు చెల్లించనున్నారు. 14 శాతం గ్రూపు ఇన్సెంటివ్ కింద రూ.111.45 కోట్లు పంపిణీ చేస్తారు. ఒక శాతం వ్యక్తిగత ఇన్సెంటివ్ కింద రూ.5.57 కోట్లు ఇవ్వనున్నారు. చెల్లింపులో భూగర్భ గని కార్మికులకే అధిక ప్రాధాన్యత ఇచ్చారు. వారికి ప్రతి మస్టరుపై రూ.771.11 పైసల చొప్పున లెక్కించనున్నారు. ఉపరితల గనుల్లో పనిచేసే ఉద్యోగులకు రూ.610.46 పైసల చొప్పున చెల్లించనున్నారు. ఇక విభాగాల్లో పనిచేసే ఉద్యోగులకు ప్రతి పనిదినంపై రూ. 563.50 పైసల చొప్పున లెక్కించి పంపిణీ చేస్తారు.

రూ.796 కోట్ల పంపిణీ..

2023-24 ఆర్థిక సంవత్సరంలో నికర లాభాలు రూ.2412 కోట్లుగా సింగరేణి ప్రకటించింది. దీనిపై కార్మికులకు 33శాతం పంపిణీ చేసేందుకు ప్రభుత్వం యాజమాన్యాన్ని ఆదేశించింది. అంటే రూ.796 కోట్లు ఇవ్వనుంది. దీనిపై కసరత్తు చేసిన యాజమాన్యం.. భూగర్భ, ఉపరితల గనులు, ఇతర విభాగాల్లో పనిచేసే ఉద్యోగులకు వారి ప్రతి పనిదినం ఆధారంగా చెల్లించేందుకు నివేదిక తయారుచేసింది. ఉద్యోగులు గ్రూపుగా సాధించిన ఇన్సెంటీవ్, వ్యక్తిగత ఇన్సెంటీవ్‌పై మరికొంత శాతాన్ని పంపిణీ చేసేందుకు లెక్కలు సిద్ధం చేశారు.

42 వేల మంది ఉద్యోగులకి..

కార్మికులకు లాభాల వాటాను సోమవారం పంపిణీ చేయనున్నారు. సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న 42 వేల మంది ఉద్యోగులకు వాటాను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. గతనెల 20న లాభాల వాటాను ప్రకటించారు. దసరా ముందు పంపిణీ చేసేందుకు నిర్ణయించిన క్రమంలో యాజమాన్యం పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంది.



సింగరేణి కార్మికులు

భారాస నిరసన దీక్ష భగ్నం

గోదావరిఖని, న్యూస్‌టుడే: సింగరేణి లాభాల వాటాపై కార్మికులను ప్రభుత్వం మోసం చేసిందంటు భారాస ఆధ్వర్యంలో ఆదివారం తలపెట్టిన నిరసన దీక్షను పోలీసులు భగ్నం చేశారు. అనుమతి లేదంటూ టెంటును తొలగించారు. దీంతో పోలీసులకు నాయకుల మధ్య తోపులాట జరిగింది. అనంతరం తెబొగకాసం కార్యాలయ ఆవరణలో నిరసన దీక్షను కొనసాగించారు.



నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు చందర్, మధూకర్, దివాకర్‌రావు

తమ్మిచెరువుకు తామర సొబగులు

మంథని పట్టణంలోని తమ్మి చెరువు, రావుల చెరువుల్లో విరబూసిన తామర పూలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఉదయం, సాయంత్రం నడకకు వచ్చే వారితోపాటు, స్థానికులు వాటిని వీక్షిస్తున్నారు. దసరా సెలవులకు మంథనిలోని బంధువుల ఇళ్లకు చేరుకున్న చిన్నారులతో కలిసి పెద్దలు చెరువు గట్లపై కూర్చుని ప్రకృతి రమణీయతను ఆస్వాదిస్తున్నారు.

-న్యూస్‌టుడే, మంథని గ్రామీణం



ముంపు సమస్య కొలిక్కి వచ్చేదెన్నడు?

● పదేళ్లుగా చామనపల్లి గ్రామస్థుల ఇబ్బందులు
● వలస పోతున్నా.. పట్టించుకోని అధికారులు

న్యూస్‌టుడే, ధర్మారం

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నందిమేడారం రిజర్వాయర్ సామర్థ్యం పెంపుతో ముంపు సమస్య ఏర్పడి చామనపల్లి గ్రామస్థులు నరకయాతన పడుతున్నారు. చర్మ సంబంధిత సమస్యతో ఇతర గ్రామాలకు తరలుతున్నారు. నందిమేడారం రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి మట్టం 233 మీటర్లు కాగా.. పదేళ్ల క్రితమే ముంపునకు గురయ్యే భూములను, 84 ఇళ్లను ప్రభుత్వం పరిహారం చెల్లించి సేకరించింది. అయితే గ్రామాన్నంతా స్వాధీనం చేసుకోవాలని గ్రామస్థులు పట్టుబట్టడంతో ఇళ్ల సర్వే అప్పుడు జరగలేదు. గ్రామస్థుల డిమాండ్లతో 2021లో గ్రామాన్నంతా సర్వే చేసి.. పరిహారం రూ.137.42 కోట్లు అవసరమని ప్రభుత్వానికి నివేదిక పంపారు. కానీ ఇప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో గ్రామస్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



నీటిపారుదల శాఖ అధికారులు పెట్టిన జలాశయ నీటి మట్టం గుర్తు చూపుతున్న రాజేశం

భరించలేని దుర్వాసన.. దోమల బెడద

ఎల్లంపల్లి జలాశయం నుంచి మధ్యమానేరుకు గోదావరి నీళ్లను తరలించడంలో భాగంగా ఏటా ఎత్తిపోతలు చేపట్టి.. నెలరోజులకు పైగా కొనసాగిస్తారు. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా ఉన్న నందిమేడారం జలాశయాన్ని చామనపల్లిలోని ఇళ్ల సమీపానికి నీరు వచ్చే వరకు నింపితేనే ఈ ఎత్తిపోతలు జరుగుతాయి. దీంతో ఇళ్ల సమీపంలోకి నీళ్లు వచ్చినప్పుడల్లా.. భరించలేని దుర్వాసన, దోమల బెడదతో చుట్టూ పక్కల వారు బాధపడుతున్నారు. బావుల్లో, సెప్టిక్ ట్యాంకుల్లో నీరు ఉబికి వస్తోంది. దీంతో మరుగుదొడ్లు వినియోగించుకోలేకపోతున్నామని వారు వాపోతున్నారు. ఎత్తిపోతల అనంతరం భరించలేని దుర్వాసన వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఇటీవల ధర్మారానికి వచ్చినప్పుడు ఈ సమస్యను ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ ఆయన దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. అంతకు ముందు నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి ఈ సమస్యపై విన్నవించారు.



చేతులకు దోమలు కుట్టడం వల్ల ఏర్పడిన నల్ల కంతులను చూపుతున్న యువతులు

పక్క గ్రామానికి వెళ్లిపోదామనుకుంటున్నాం: బండి నందం

నాతో పాటు మా ఇంట్లో వాళ్లందరం చర్మవ్యాధులతో బాధపడ్డాం. దురదతో పుండ్లు, నల్లమచ్చలు అయ్యాయి. కొద్దిరోజులుగా చర్మవ్యాధులు తగ్గినా దోమలు తగ్గలేదు. రిజర్వాయర్లో నీటిమట్టం పెరిగిన ప్రతీసారి ఇళ్ల సమీపానికి నీళ్లు వచ్చి భరించలేదని దుర్వాసన వస్తోంది. జలాశయం పక్కనే ఇళ్లున్నవారికి సమస్య తీవ్రంగా ఉంది. పక్క గ్రామానికి వెళ్లాలని ఆలోచిస్తున్నాం.

ఎవరూ పట్టించుకోవడం లేదు: రామగిరి రాజేశం

చర్మ సంబంధిత సమస్యలు, జ్వరాలతో తరచూ బాధపడుతున్నాం. రెండు నెలల క్రితం నామమాత్రంగా ఒకసారి ఊళ్లో వైద్య శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ వైద్య సిబ్బంది సైతం ఇటు వైపు రాలేదు. ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు పొందాం. మా వాడ నుంచి చాలా మంది ఇళ్లు ఖాళీ చేసి ఇతర గ్రామాలకు వలసపోతున్నారు. ప్రభుత్వం స్పందించి మా సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలి.

లక్ష్యం.. ప్రణాళిక.. సాధన..

◆ డీఎస్సీ ఫలితాల్లో జిల్లా టాపర్ల మనోగతం



విజేతల గెలుపు సూత్రాలివి

'విజేతలు భిన్నమైన పనులు చేయరు.. అందరూ చేసే పనులనే వైవిధ్యంగా చేస్తారు..' అని అంటారు ప్రముఖ ఆంగ్ల రచయిత శివ్‌ఖేరా. అందరికీ ఉన్న సమయమే తమకూ ఉన్నా కొందరు దాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. వేల్లో ఒకడిగా కాకుండా, అందరిలోనూ ప్రముఖుడిగా నిలవాలన్న లక్ష్యంతో ఎంచుకున్న రంగంలో మేటిగా నిలుస్తున్నారు.



న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్

వారంతా లక్ష్యం నిర్దేశించుకున్నారు. సాధన కోసం కఠోరంగా శ్రమించారు. పాఠ్య పుస్తకాలనే నేస్తాలుగా మలచుకున్నారు. అవగాహనలో పొరాలుగా చేసుకున్నారు. ప్రణాళిక, లక్ష్యం, పునశ్చరణ, స్వీయ మూల్యాంకనం.. ఇవే తమ గెలుపు సూత్రాలని చెబుతున్నారు. ఇటీవలి డీఎస్సీ ఫలితాల్లో పెద్దపల్లి జిల్లా స్థాయిలో వివిధ కేటగిరీల్లో మొదటి ర్యాంకు సాధించిన అభ్యర్థులు తమ సన్నద్ధత తీరును 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు.



ప్రతి పాఠానికీ స్వీయ పరీక్ష



ఉన్నది ఒకే పోస్టు, ప్రతి రోజూ రేపే ఫైనల్ పరీక్ష ఉన్నట్లు భావించా. ఉద్యోగానికి దరఖాస్తు చేసినప్పటి నుంచి ఎలాగైనా సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నా. ఏరోజు సమయాన్ని వృథా చేయలేదు. అవసరమైన ప్రణాళిక వేసుకొని సన్నద్ధమయ్యా. ఒక్కో రోజు రెండు, మూడు గంటలే నిద్ర పోయాను. ఆన్‌లైన్‌లో పాఠాలు విన్నా. ప్రతి పాఠానికి స్వీయ పరీక్ష పెట్టుకొని తప్పులు లేకుండా సాధన చేశా. సబ్జెక్టుకు సంబంధించిన అంశాలపై మిత్రులతో చర్చించా. క్వశ్చన్ బ్యాంక్ ఎంతో తోడ్పడింది. సాధన, పునశ్చరణతోనే మంచి ఫలితం వస్తుందని నమ్మిన. రెండు నెలల కిందట గురుకులంలో పీజీటీగా విధుల్లో చేరా. భర్త శ్రీనివాస్ సహకారంతోనే రెండు కొలువులు సాధించగలిగా.

– సుభద్ర, స్కూల్ అసిస్టెంట్ ఆంగ్లం, భద్రిపల్లి, అంతర్గాం మండలం

ఓటమి నేర్పిన విషయాలెన్నో..



ఓటమి నా జీవితాన్ని మలుపు తిప్పింది. గతంలో ఒకసారి డీఎస్సీ, మూడు సార్లు గురుకుల ఉపాధ్యాయ పరీక్ష రాసినా ఎంపిక కాలేదు. అయినా నిరాశ చెందలేదు. మానసిక ఒత్తిడికి గురి కాలేదు. ఈసారి రోజుకు 10 గంటల పాటు సన్నద్ధమయ్యా. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తెలుగు పాఠ్యపుస్తకాలను క్షుణ్నంగా చదివా. అందులోని సాహిత్యంపై పట్టు పెంచుకున్నా. ప్రతి పాఠానికీ నోట్స్ సిద్ధం చేసుకొని కఠినమైన అంశాలను గుర్తుంచుకునేలా సాధన చేశా. అర్థం కాని విషయాలపై ఆన్‌లైన్‌లో శోధించి సందేహాలు నివృత్తి చేసుకున్నా. సైకాలజీ, మెథడాలజీని అర్థం చేసుకున్నా. కవులు, సాహితీవేత్తలకే పరిమితం కాకుండా కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్ పెంచా.

– కృష్ణ వేముల, స్కూల్ అసిస్టెంట్ తెలుగు, గోదావరిఖని

అర మార్కు మలుపు తిప్పింది



గత డీఎస్సీలో అర మార్కుతో ఉద్యోగం దూరమవడం నా జీవితాన్ని కీలక మలుపు తిప్పింది. వచ్చేసారి ఎలాగైనా సాధించాలని అప్పుడే నిర్ణయించుకున్నా. పొరపాట్లు సరిదిద్దుకున్నా. పట్టుదలతో సన్నద్ధమయ్యా. పగలు మొత్తం జిల్లా గ్రంథాలయంలోనే గడిపా. కీలక అంశాలు, సమాచారంపై స్నేహితులతో కూలంకషంగా చర్చించా. ప్రతి అంశాన్ని రాసుకున్నా. పోటీ పరీక్ష అంటే మొదట భయం వీడాలి. ఇన్నాళ్లూ చదివిన అంశాలపై తడబడకుండా పరీక్ష రాయాలి. కుటుంబ సభ్యుల సహకారంతో కొలువు సాధించా.

– నీరటి శ్రీనివాస్, ఎస్జీటీ, కదంబాపూర్, సుల్తానాబాద్ మండలం



మూడు సార్లు స్వల్ప మార్కులతో దూరం

గతంలో మూడు సార్లు వివిధ ఉద్యోగ పోటీ పరీక్షలకు హాజరైనా స్వల్ప మార్కులతో ఉద్యోగాలు కోల్పోయా. ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకొని మరింత పట్టుదల, క్రమశిక్షణ, ఏకాగ్రతతో సన్నద్ధమయ్యా. రోజుకు 6 గంటల పాటు కఠిన సాధన చేశా. గ్రంథాలయానికి వెళ్లి సిద్ధమయ్యా. 6 నుంచి 12వ తరగతి వరకు పుస్తకాల్లోని ప్రతి అంశాన్ని రాసుకున్నా. వివిధ పబ్లికేషన్ల పుస్తకాలు చదివా. రేఖాగణితం, క్షేత్రమితి, సంఖ్యామానం, త్రికోణమితిలపై పట్టు పెంచుకుని భావనలను గుర్తుంచుకున్నా. సొంతంగా నోట్స్ సిద్ధం చేసుకున్నా.

– లట్ట శ్రీనివాస్, స్కూల్ అసిస్టెంట్ గణితం, గోపాల్‌పూర్, మంథని మండలం

ఒక్క పోస్టున్నా నాదే కావాలనుకున్నా

బయోసైన్స్‌లో ఒక్క పోస్టున్నా మొదటి ర్యాంకుతో అది నాదే కావాలి.. అని లక్ష్యంగా పెట్టుకొని చదివా. గతంలో ఒకసారి డీఎస్సీ రాసినా ఉద్యోగం రాకపోవడంతో కొంత నిరాశకు గురయ్యా. ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకొని క్రమశిక్షణ, ప్రణాళికతో సన్నద్ధమయ్యా. పట్టు వదలకుండా రోజుకు 12 గంటల పాటు శ్రమించా. కంటెంట్, మెథడాలజీ, విద్యా దృక్పథాలు, సైకాలజీపై ఎక్కువగా దృష్టి పెట్టా. 6 నుంచి 12వ తరగతి వరకు పాఠ్యపుస్తకాల్లో లైన్ టు లైన్ చదువుతూ నోట్స్ రాసుకున్నా. ప్రతి పాఠానికి సొంతంగా పరీక్ష పెట్టుకొని తప్పులు దిద్దుకున్నా. భర్త మునీంద్ర, మా అమ్మ శీలావమారి ప్రోత్సాహంతో లక్ష్యం సాధించా.

– గడదాసి ప్రణీత, స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్, రామగుండం

పాఠ్యాంశాలను జీవితానికి అన్వయించుకున్నా



గతంలో రెండు సార్లు డీఎస్సీ రాసినా నిరాశే ఎదురైంది. అప్పుడు చేసిన పొరపాట్లను మననం చేసుకొని వాటినే సవాళ్లుగా తీసుకున్నా. ప్రయత్న లోపాలు తెలుసుకున్నా. క్రమశిక్షణగా రోజుకు 12 గంటల పాటు సన్నద్ధమయ్యా. పాఠ్య పుస్తకాలు, దినపత్రికల్లో వచ్చే సమాచారాన్ని క్రమం తప్పకుండా అనుసరించా. బట్టీ పట్టే విధానం కాకుండా పాఠ్యపుస్తకాల్లోని అంశాలను నిత్య జీవితానికి అన్వయించుకున్నా. సీసీఈ(నిరంతర సమగ్ర మూల్యాంకనం) విధానంలో కొత్త సమాచారం అందుబాటులో ఉండదు. అందుకే పాత పుస్తకాల్లోని అంశాలను క్రోడీకరించి నోట్స్ సిద్ధం చేసుకున్నా. వీలైనన్ని ఎక్కువ సార్లు మననం చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. ఫిజిక్స్ అనే ఫోబియాను మనసులో తొలగించుకొని సాధన చేస్తే మిగతా సబ్జెక్టుల కంటే ఇది చాలా సులువు.

– శీలం దేవేందర్, స్కూల్ అసిస్టెంట్, భౌతికశాస్త్రం, వెక్లాస్‌పూర్, మంథని మండలం

సమస్యల వలయంలో శాతవాహన

శాశ్వత ఉపకులపతి లేక నిర్ణయాల్లో జాప్యం

న్యూస్‌టుడే, కరీంనగర్ కలెక్టరేట్



సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విద్యార్థి సంఘాల ఆందోళన (పాతచిత్రం)

విశ్వవిద్యాలయాలు.. విద్యార్థుల మేధోశక్తికి పదును పెడుతూ వారిని భావి భారత పౌరులుగా తీర్చిద్దాల్సిన ప్రాంగణాలు.. విద్యార్థి శక్తిని దేశానికి ఉపయోగపడేలా చేయాల్సిన విద్యా కర్మాగారాలు. . అలాంటివి సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. కరీంనగర్ శాతవాహన విశ్వవిద్యాలయం సమస్యలకు లోగిలిగా మారింది. మే 21న గత ఉపకులపతి పదవి ముగిసింది. ఇన్‌ఛార్జి ఉపకులపతిగా ఐఏఎస్ సురేంద్రమోహన్ నాలుగు నెలలుగా కొనసాగుతున్నారు.

విజిలెన్స్ విచారణ

విశ్వవిద్యాలయంలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు చేస్తూ సామాజిక కార్యకర్తలు, విద్యార్థి సంఘాలు ప్రభుత్వానికి ఫిర్యాదు చేయగా.. విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. రెండు నెలలుగా వర్సిటీలో విజిలెన్స్ విచారణ కొనసాగుతోంది. శాశ్వత ఉపకులపతిని నియమించాలని కోరుతూ, విజిలెన్స్ విచారణ పారదర్శకంగా జరిపించాలని కోరుతూ విద్యార్థి సంఘాలు దఫాలుగా ఆందోళనలు చేస్తూ.. ఉన్నతాధికారులకు విజ్ఞప్తులు సమర్పిస్తున్నారు.

■ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ నోటిఫికేషన్ జారీ చేయటంలేదు. వందలాది మంది విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. పేరుకు మాత్రమే విశ్వవిద్యాలయంగా చెప్పుకునే పరిస్థితి ఏర్పడింది.

■ ఏటా కొత్త కోర్సులు ప్రవేశపెట్టి విశ్వవిద్యాలయంలో విద్యార్థుల సంఖ్య పెంచటానికి ప్రయత్నం చేయాలి. కానీ వాటి జాడే లేదు.

■ పాలక మండలి(ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్)గా పిలిచే శాతవాహన విశ్వవిద్యాలయానికి పూర్తిస్థాయి పాలక మండలి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు కొనసాగింది. ఆ తర్వాత రాష్ట్ర ఆర్థిక, ఉన్నత, డిగ్రీ విద్య కమిషనర్లు, కార్యదర్శులతో పాటు ఎస్‌యూ వీసీ సభ్యుడిగా ఉండే తాత్కాలిక కార్యనిర్వాహక మండలి మాత్రమే కొనసాగుతోంది.

■ ఇన్‌ఛార్జి ఉపకులపతి నాలుగు నెలల కిందట వచ్చారంటే.. మళ్లీ ఇటీవల విశ్వవిద్యాలయానికి వచ్చారు. ప్రభుత్వ శాఖల పనుల నిర్వహణలో తీరిక లేకపోవటంతో ఈ సమస్య ఎదురవుతోంది. ఏ సంతకం అవసరమైనా, ఏ ప్రతిపాదన ఆమోదానికైనా విశ్వవిద్యాలయం సిబ్బంది హైదరాబాద్‌కు వెళ్లి సంతకం తీసుకొస్తున్నారు.

ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం

ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఏ ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. ఏదైనా నిర్ణయం తీసుకోవాలనుకుంటే చరవాణిలో సంప్రదిస్తూ నిర్ణయం తీసుకుంటున్నాం. శాశ్వత వీసీ త్వరలో వచ్చే అవకాశముంది. - **ఆచార్య వరప్రసాద్, రిజిస్ట్రార్, శాతవాహన విశ్వవిద్యాలయం**

■ విధానపరమైన, అభివృద్ధి పనుల నిర్ణయాలు తీసుకోవటంలో జాప్యం జరుగుతోంది. బోధన, బోధనేతర ఉద్యోగుల సమస్యలతోపాటు విద్యార్థి పరిశోధకుల సమస్యలు పరిష్కారం కావటంలేదు.

■ శాశ్వత ఉపకులపతులు ఇదిగో, అదిగో వస్తున్నారని ప్రభుత్వం ఊరడింపు ప్రకటనతో సరిపుచ్చుతోంది. సమస్యల పరిష్కారం జాప్యం చోటు చేసుకుంటుంది.

ఎస్సారెస్పీకి 21 వేల క్యూసెక్కుల వరద

జగిత్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం సాయంత్రం వరకు 21,590 క్యూసెక్కుల వరద వస్తుండగా వరదకాలువకు 12 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసి మధ్యమానేరుకు తరలిస్తున్నారు. కాకతీయ కాలువ, విద్యుత్ ఉత్పత్తికి 6,800, ఎస్కేప్ గేట్లద్వారా గోదావరిలోకి 1,200, లక్ష్మీ కాలువకు 150, సరస్వతి కాలువకు 500, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో గరిష్ఠస్థాయిలో 80.501 టీఎంసీల నీటినిల్వ, 1091 అడుగుల నీటిమట్టం ఉంది.

స్తంభంపై మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతం

పొలంలో పడి సహాయ లైన్‌మెన్ మృతి



నరేశ్

మానకొండూర్, న్యూస్‌టుడే: విద్యుత్తు స్తంభంపై మరమ్మతు చేస్తున్న ఉద్యోగి విద్యుదాఘాతంతో కింద పడి మృతి చెందడం ఆదివారం మానకొండూర్ మండలం కెల్లేడు శివారులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చీర్లవంచకు చెందిన జోగి నరేశ్(37) మూడున్నరేళ్లుగా కొండపల్కల క్లస్టర్‌లో సహాయ లైన్‌మెన్‌గా పని చేస్తున్నారు. కెల్లేడు శివారులోని వరి పొలంలో విద్యుత్తు స్తంభంపై ఇన్సులేషన్ మరమ్మతు కోసం ఆదివారం ఆయన సబ్‌స్టేషన్‌లో ఎల్‌సీ తీసుకొన్నారు. స్తంభం పైకి ఎక్కి మరమ్మతులు చేస్తుండగా విద్యుత్తు సరఫరా కావడంతో కింద పడ్డారు. కింద వరి పొలంలో తల బురదలో కూరుకుపోయి ఊపిరి ఆడక మృతి చెందారు. ఘటన జరిగిన సమయంలో నరేశ్ మినహా అక్కడ ఎవరూ లేరు. కింద పడిన వెంటనే బురద నుంచి బయటకు తీస్తే ప్రాణాలు దక్కేవని స్థానికులు పేర్కొన్నారు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య, పదేళ్లలోపు కుమారుడు, కూతురున్నారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

కరీంనగర్ బార్ అసోసియేషన్ జట్టు విజయం

చైతన్యపురి, న్యూస్‌టుడే: వరంగల్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు, కరీంనగర్ బార్ అసోసియేషన్ న్యాయవాదుల మధ్య ఆదివారం వరంగల్‌లోని ఫాతిమా ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ క్రీడా మైదానంలో జరిగిన క్రికెట్ పోటీల్లో కరీంనగర్ న్యాయవాదుల జట్టు గెలుపొందినట్లు స్పోర్ట్స్ సెక్రెటరీ మడిపల్లి రవి తెలిపారు. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్‌ను ఎంచుకున్న వరంగల్ జట్టు 16 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 118 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కరీంనగర్ న్యాయవాదుల జట్టు 13 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి లక్ష్యాన్ని ఛేదించింది. గెలుపొందిన జట్టు న్యాయవాదులను బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి.వి.రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్ రెడ్డి, అసోసియేషన్ సభ్యులు అభినందించారు.



గెలుపొందిన న్యాయవాదుల జట్టు సభ్యులు

షాట్‌పుట్‌లో అక్కాచెల్లెళ్లు అదుర్స్

న్యూస్‌టుడే, ఓదెల

ఆటలపై ఇష్టంతో అక్క మెలకువలు నేర్చింది.. ఆమె స్ఫూర్తితో చెల్లెలు సాధన మొదలుపెట్టింది.. క్రీడల్లో పతకాలు సాధిస్తూ ఒక్కో మెట్టు ఎక్కుతున్నారా సోదరీమణులు. ఓదెల మండలం కొలనూరుకు చెందిన రేండ్ల రాజేందర్, శ్రీహర్ష దంపతుల కూతుళ్లు శ్రావ్యశ్రీ, సౌమ్యశ్రీ అథ్లెటిక్స్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణిస్తున్నారు. రాజేందర్ కారు నడుపుతూ, శుభకార్యాలకు వంటలు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. స్వతహాగా కబడ్డీ క్రీడాకారుడైన ఆయన కూతుళ్ల ఆసక్తిని గమనించి ప్రోత్సహించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు మెలకువలు నేర్పించారు.



చిన్నతనం నుంచి నాకు ఆటలంటే చాలా ఇష్టం. బడిలో జరిగిన ఆటల పోటీల్లో నా ప్రతిభను గుర్తించిన వ్యాయామ ఉపాధ్యాయుడు షాట్‌పుట్‌లో ప్రోత్సహించారు. ప్రత్యేక శిక్షణ ఇస్తూ మెలకువలు నేర్పించారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ఇంటికి సమీపంలోనే ఉన్న పాఠశాల మైదానంలో సాధన చేస్తున్నాను. గతేడాది బిహార్‌లోని పాట్నాలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఆడాను. అలాగే ఖమ్మం, మెదక్, హైదరాబాద్, వరంగల్, కరీంనగర్‌లలో జరిగిన పోటీల్లో ఆరు మార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఇటీవల గోదావరిఖని ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి ఈ నెల 7, 8 తేదీల్లో హనుమకొండలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. ముందు అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యంగా పెట్టుకున్నా. **- శ్రావ్యశ్రీ, తొమ్మిదో తరగతి**

ఉదయం సాయంత్రం సాధన



అక్కయ్య స్ఫూర్తితో ఆటలపై ఆసక్తి పెంచుకున్నా. ప్రతి రోజూ ఉదయం 5.30 నుంచి 6.30 గంటల వరకు, సాయంత్రం పాఠశాల ముగియగానే గంట పాటు వ్యాయామ ఉపాధ్యాయుడి పర్యవేక్షణలో సాధన చేస్తున్నాం. వివిధ ప్రాంతాల్లో జరిగే పోటీల్లో పాల్గొనేలా అమ్మానాన్న మమ్మల్ని ప్రోత్సహిస్తున్నారు. మేం తీసుకునే ఆహారంలోనూ జాగ్రత్తలు పాటిస్తున్నారు. హైదరాబాద్‌లో రెండు సార్లు నిర్వహించిన రాష్ట్ర స్థాయి షాట్‌పుట్ పోటీల్లో ఆడాను. గతేడాది భద్రాచలంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో మొదటి స్థానంలో నిలిచా. జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లోనూ ఆడాను. జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలన్నదే లక్ష్యం.

- రేండ్ల సౌమ్యశ్రీ, ఎనిమిదో తరగతి

ఆర్టీసీ బస్సు ఢీకొని

ఒప్పంద కార్మికుడి దుర్మరణం



లక్ష్మయ్య

పెద్దపల్లి, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు ఢీకొని ఒప్పంద కార్మికుడు దుర్మరణం చెందిన ఘటన పెద్దపల్లి మండలం అందుగులపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. బసంత్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన వేముల లక్ష్మయ్య(58) బసంత్‌నగర్‌కేశోరాం సిమెంట్ పరిశ్రమలో ఒప్పంద కార్మికుడిగా పని చేస్తున్నారు. ఆదివారం ఉదయం భార్య మల్లీశ్వరితో కలిసి ద్విచక్రవాహనంపై దేవునిపల్లిలోని లక్ష్మీనరసింహ స్వామిని దర్శనానికి వెళ్తున్నారు. అందుగులపల్లి వద్ద రోడ్డు దాటుతుండగా గోదావరిఖని నుంచి పెద్దపల్లి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో లక్ష్మయ్య అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. గాయపడ్డ మల్లీశ్వరిని పెద్దపల్లి ఆస్పత్రికి తరలించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై స్వామి చెప్పారు.

ఆరుతడికి ఊతమేది!

ఈ నెల నుంచి యాసంగి సీజను ఆరంభం

న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం

దశాబ్దం కిందటి వరకు ఉమ్మడి జిల్లాలో ప్రధాన పంట పత్తి, మక్క, పసుపు తదితర అన్ని పైర్లను దాటుకుని ప్రస్తుతం కేవలం వరివిస్తీర్ణం గణనీయంగా పెరిగి పంటలవైవిధ్యం దెబ్బతింటోంది. ఈ నెల నుంచి యాసంగి మొదలుకానున్న తరుణంలో ప్రభుత్వ ప్రోత్సాహం దీర్ఘకాలికంగా ఆరుతడికి ఊతమివ్వనుంది.

■ ఆరుతడి పంటల సాగుకు కూలీల కొరత, మద్దతు ధరకు సేకరించకపోవటం, మార్కెటింగ్ సమస్య, కోతులు, నెమళ్లు, అడవిపందులు తదితర వన్యప్రాణుల బెడద, విత్తన రాయితీని, ఆరుతడి పైర్లకు ఉపకరించే బిందుసేద్య రాయితీని ఎత్తివేయటంతో పాటు సాగునీటి లభ్యత పెరగటం తదితర కారణాలతో రైతులందరూ వరివైపే మళ్లారు.

■ జగిత్యాల పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థానంలో రాష్ట్రంలోనే వరి, నువ్వులపై అత్యధిక పరిశోధనలు సాగుతున్నాయి. పొలాసలో వేరుసెనగ, పత్తి, కంది, చెరకు తదితర అన్నిరకాల ఆరుతడి పంటలపై పరిశోధనలను చేపడితే ద్వారా మన ప్రాంత నేలలకు అనువైన అధిక దిగుబడి వంగడాల రూపకల్పన సాధ్యపడుతుంది. ఇటీవల జగిత్యాల జిల్లాలో ఆవాలసాగు గణనీయంగా పెరుగుతున్నందున కేంద్రం ప్రకటించినట్లు పొలాస పరిశోధనస్థానంలో ఐసీఏఆర్ ఆవాల పరిశోధన కేంద్రాన్ని ఏర్పరచాలి.

■ ఐసీఏఆర్ కృషివిజ్ఞాన కేంద్రం జమ్మికుంటలో ఉండగా ఇక్కడ పూర్తిస్థాయి పత్తి పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. సెనగ, కుసుమ, పొద్దుతిరుగుడు, ఆముదం, పెసర, మినుము తదితరాల్లో మేలైన వంగడాలను రూపొందించటం, ఆరుతడి పంటల్లో దిగుబడులు పెరిగి చీడపీడలు, కలుపు నివారణ రసాయనాలను శాస్త్రవేత్తలు అందుబాటులోకి తెచ్చినట్లయితే నల్లరేగటి నేలలున్న పెద్దపల్లి, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల రైతుల క్రమంగా వీటిసాగును పెంచుతారు. పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల్లో ఏరువాక కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంది.

■ పెద్దపల్లి జిల్లా కూనారం వరి పరిశోధనస్థానంలో పలు ఆరుతడి పంటలపై పరిశోధనలను చేపట్టాలి. కరీంనగర్ పరిశోధనస్థానంలో కేవలం మొక్కజొన్న పైనే పరిశోధనలు సాగుతుండగా మన రైతులు పండించే, స్థానిక నేలలకు అనువైన పంటలపై పరిశోధనలను చేపట్టి చేపట్టి తెలంగాణ సీడ్స్ ద్వారా రైతులకు రాయితీపై అన్నిరకాల విత్తనాలను ఇచ్చినట్లయితే రైతులకు ప్రోత్సాహకంగా ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో 2014 - 24 వానాకాలంలో సాగు విస్తీర్ణం(ఎకరాల్లో...)

పంట	2014	2024
వరి	6,08,321	9,82,687
పత్తి	5,03,402	1,69,013
మక్క	85,739	41,259
కంది	21,547	11,515
నువ్వులు	15,064	29,297
మామిడి	65,373	73,741
పసుపు	42,546	30,430
ఇతర పూలు, పండ్లు, మిరప, కూరగాయలు	22,549	42,562



ఆవాల పైరు

పంట మార్పిడి పాటించాలి



వరి స్థానంలో మరోపంటగా ఆరుతడిని పండిస్తే పంటల సరళి, నేలస్థితిగతులు మెరుగుపడతాయి. నేలలు, నీటిలభ్యత, కూలీలు, వన్యప్రాణుల బెడద, మార్కెటింగ్ చూసుకుని రైతులు పంటమార్పిడి పాటించాలి.

- డాక్టర్ జి.శ్రీనివాస్, సహపరిశోధన సంచాలకులు

■ జగిత్యాల చల్‌గల్ వాలంతరీ ప్రదర్శన క్షేత్రంలో ఉద్యాన పరిశోధస్థానాన్ని ఏర్పాటు చేసినట్లయితే మామిడి, పసుపు, ఉల్లి, అల్లం, కూరగాయలు, పసుపు, మిరప, ఇతర సీతాఫల్, జామ, బత్తాయి, బొప్పాయి, అల్లం, కర్బూజా, సపోటా, అరటి తదితర పండ్లు, పూలసాగును చేపట్టే రైతులకు మేలైన వంగడాలు అందుబాటులోకి వస్తాయి. జగిత్యాల మామిడి మార్కెట్లో శాశ్వత పండ్ల మార్కెటును ఏర్పాటుచేస్తే రైతులకు ఏడాది పొడవునా విక్రయ అవకాశాలుంటాయి.

■ నాలుగు జిల్లాల్లోనూ ఆయిల్‌పామ్ మొక్కలను పెద్దఎత్తున నాటుతుండగా స్థానికంగా గానుగ పరిశ్రమలను నెలకొల్పాలి. జిల్లాలో యాసంగిలో జొన్న, సజ్జ, నువ్వులు, ఆవాలు తదితర పంటల్లో రైతులు విత్తనోత్పత్తి చేపడుతున్నందున విత్తనోత్పత్తి పైర్లసాగును పెంచేలా ప్రభుత్వం ఉత్తరాది రాష్ట్రాల కంపెనీలు రైతులతో ధర నిర్ణయం, ముందస్తు ఒప్పందం చేసేలా చూడాలి. జగిత్యాల మండలం లక్ష్మీపూర్‌లో రూ.7 కోట్లతో నిర్మిస్తున్న విత్తనశుద్ధి కర్మాగారాన్ని అందుబాటులోకి తేవాలి.

■ ప్రభుత్వం హామీఇచ్చినట్లు ముత్యంపేట చెరకు కర్మాగారాన్ని తెరిస్తే చెరకు సాగు గణనీయంగా పెరుగుతుంది. వెల్గటూరు, మల్లాపూర్ మండలాల్లో తలపెట్టిన ఫుడ్‌పార్కులను ఏర్పాటుచేస్తే రైతులకు విక్రయ అవకాశాలు దరిచేరి ఆరుతడి పంటలకు మళ్లుతారు. నిజామాబాద్‌లోని పడిగెల్ వద్ద తలపెట్టిన స్పైసెస్ పార్కును పూర్తిచేస్తే ఉద్యాన పంటల రైతులకు ధీమాగా ఉంటుంది.

■ పొలాస పరిశోధన స్థానంలోని ఇంక్యూబేషన్ సెంటర్ ద్వారా యువరైతుల ఆవిష్కరణలను ప్రోత్సహించాలి, వ్యవసాయ అనుబంధ రంగాలు, ఉప ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి యూనిట్లను, చిన్నతరహా పరిశ్రమలను నెలకొల్పేలా రాయితీలనివ్వాలి. పాలీహౌజులు, ఆరుతడి పంటలు, కూరగాయల విత్తనాలు, యంత్రపరికరాల రాయితీని పునరుద్ధరించాలి. పంటలబీమాను యాసంగి నుంచి అమలుచేయాలి. విపణిలో ధరతగ్గిన ఉత్పత్తులను మార్కెట్‌జోక్య పథకం ద్వారా ప్రభుత్వం కొనుగోలుచేస్తే ఆరుతడికి క్రమంగా దన్ను కలుగుతుంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 4 PM)
గోదావరిఖని : 80085 73573
పెద్దపల్లి : 80085 73542
మంథని : 99122 68471

న్యూస్‌టుడే, ధర్మారం

? పంట రుణం రూ.1.80 లక్షలే ఉన్నప్పటికీ సాంకేతిక కారణాలతో మాఫీ రాలేదు. అధికారులు వచ్చి వివరాలు సరిచూసి వెళ్లినా ఇప్పటివరకు మాఫీ కాలేదు. మరో వైపు బ్యాంకర్లు రుణం చెల్లించాలంటూ అడుగుతున్నారు. **-రాజయ్య, ఖిలావనపర్తి**

✔ వేర్వేరు కారణాలతో పంట రుణ మాఫీ వర్తించని రైతుల వివరాలన్నీ ఆన్‌లైన్లో నమోదు చేశాం. త్వరలోనే వీరందరికీ మాఫీ సొమ్ము అందుతుంది. రూ.2 లక్షలు దాటిన రుణాలకు సంబంధించి ఇంకా షెడ్యూలు రాలేదు. **-రాజు, మండల వ్యవసాయాధికారి**

న్యూస్‌టుడే, జూలపల్లి

? జూలపల్లి మండలం వెంకట్రావుపల్లిలో వీధి దీపాలు లేక ఇబ్బంది పడుతున్నాం. **- స్థానికులు**

✔ సోమవారం వీధి దీపాలను అమర్చుతాం. **- గ్రామ కార్యదర్శి సాగర్‌రావు**

పొలిమేరలో పొంచి ఉన్న ప్రమాదం



ముత్తారం మండలం పారుపల్లి పంచాయతీ పరిధి శాలగుండ్లపల్లెలో మూడు నెలల కిందట బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఊరి పొలిమేరలో గ్రామ బంధం(రహదారికి ఇరువైపులా రెండు కర్రలు నిలిపి వాటిని మరో కర్రతో అనుసంధానిస్తూ మధ్యలో దిష్టి కుంభం) వేశారు. నెలలు గడుస్తున్నా గ్రామ బంధాన్ని తొలగించకపోవడంతో కర్రలు ఓవైపు ఒరిగి ప్రమాదకరంగా మారాయి. దారిపై వెళ్లే వారిపై కూలకముందే తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, ముత్తారం**

పగటి పూట ప్రయాణ కష్టాలు



జూలపల్లి మండలం కుమ్మరికుంట గ్రామానికి మధ్యాహ్నం సమయంలో బస్సు సౌకర్యం లేక స్థానికులు ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడుతున్నారు. ప్రతి రోజూ ఉదయం 7.30కి, తిరిగి సాయంత్రం 6 గంటలకు మాత్రమే బస్సు వస్తోంది. మధ్యాహ్నం సమయంలో స్థానికులు రెండు కిలోమీటర్ల దూరం నడిచి, బాలరాజుపల్లి వద్ద నిలబడి పెద్దపల్లి, చొప్పదండి వైపు వెళ్లే బస్సుల్లో ప్రయాణించాల్సి వస్తోంది. దసరా పండుగ నేపథ్యంలో ఆటోలు సరిగ్గా లేక మహిళలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి బస్సు సౌకర్యాన్ని కల్పించాలని కుమ్మరికుంట గ్రామస్థులు కోరుతున్నారు.
-న్యూస్‌టుడే, జూలపల్లి

కలగానే శుద్ధ జలం



రామగిరి మండలం చందనాపూర్ గ్రామ ప్రజలకు శుద్ధ జలం అందించాలన్న ఆర్జీ-1 యాజమాన్యం హామీ కలగానే ఉంటోంది. అధికారులు ఆరు నెలల క్రితం గ్రామంలోని ప్రధాన నీటిట్యాంక్ పక్కన షెడ్డు నిర్మాణంతో పాటు యంత్రాలను సమకూర్చారు. కానీ పైప్‌లైన్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో గ్రామ ప్రజలు శుద్ధజలం కోసం నిరీక్షించక తప్పడం లేదు.
- న్యూస్‌టుడే, యైటింక్లయిన్‌కాలనీ

క్రికెట్ పోటీలో అధికారుల జట్టు విజయం

గోదావరిఖని, న్యూస్‌టుడే: స్థానిక సింగరేణి జవహర్‌లాల్‌నెహ్రూ క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించిన స్నేహపూర్వక క్రికెట్ పోటీలో అధికారుల జట్టు విజయం సాధించింది. సింగరేణి, ప్రెస్‌క్లబ్ జట్ల మధ్య స్నేహపూర్వక క్రికెట్ పోటీ ఏర్పాటు చేశారు. ఈ పోటీలను ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ ప్రారంభించారు. గెలుపొందిన జట్టుకు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ కప్పును అందజేశారు.



విజేతకు కప్పు అందజేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

వాసవి క్లబ్ సభ్యులకు సన్మానం

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: స్థానిక ఆర్యవైశ్య భవనంలో ఆదివారం వాసవి క్లబ్ రీజియన్ ఛైర్మన్ అల్లెంకి లింగమూర్తి-పద్మ దంపతుల ఆధ్వర్యంలో అల్లెంకి రీకాన్-2024 పేరున క్లబ్ ప్రతినిధులు, సభ్యులను సన్మానించారు. క్లబ్ ఇంటర్‌నేషనల్ కోశాధికారి శ్రీనివాస్, సభ్యులు శ్రీనివాస్, మధూకర్, లచ్చయ్య, వాణి, ప్రభాకర్ పాల్గొన్నారు.



సుల్తానాబాద్ వాసవి క్లబ్ సభ్యులను సన్మానిస్తున్న చిత్రం

ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయరమణారావు పేర్కొన్నారు. సుల్తానాబాద్ మండల ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం నూతన కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమం ఆదివారం మండలంలోని నర్సయ్యపల్లిలో జరగ్గా ఎమ్మెల్యే హాజరై నూతన కమిటీని సన్మానించి అభినందించారు. సంఘం రాష్ట్ర నాయకులు రవి, మధుసూదన్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, విజయ్, రామకృష్ణ, శశిధర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్: ఎలిగేడు మండలం శివపల్లిలో ఎమ్మెల్యే విజయరమణారావుకు ఆయన నివాసంలో జిల్లాలోని బియ్యం మిల్లర్లు ఆదివారం కలిసి వారి సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. ఎమ్మెల్యే వారి సమస్యలను సీఎం, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి.. పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మిల్లర్ల సంఘం జిల్లా నాయకులు అశోక్, తిరుపతిరెడ్డి, మండల నాయకులు పురుషోత్తంరావు, కేశవరావు, విజయపాల్‌రెడ్డి, ప్రకాశ్‌రావు, రాజన్న, వాసు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు



దర్యాపూర్ ఆదర్శ పాఠశాల పూర్వ విద్యార్థులు



జూలపల్లిలో కలుసుకున్న పోలీసులు

ఆత్మీయ సమ్మేళనాలు

జూలపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని పెద్దాపూర్ శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపంలో ఆదివారం పోలీసులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. జూలపల్లి మండలానికి చెందిన సుమారు 120 మంది పోలీసులు ఒక చోట చేరారు. సీఐలు రాజయ్య, సురేష్, శ్రీనివాస్, శ్రీకాంత్, కిరణ్, ఏఎస్సైలు లక్ష్మణ్, శంకర్ సింగ్, పోలీసులు మల్లికార్జున్, గంగాధర్, కాజామియా, రమేష్, అరుణ్ పాల్గొన్నారు.

మంథని(ముత్తారం), న్యూస్‌టుడే: ముత్తారం మండలం దర్యాపూర్ ఆదర్శ పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. వారి గురువులను సత్కరించారు. ఎస్సై నరేష్ పాల్గొన్నారు.

సంఘటితంతోనే హిందువుల మనుగడ

పెద్దపల్లి, న్యూస్‌టుడే: హిందువులు సంఘటితంగా లేకపోవడంతోనే వందేళ్లు బానిస సంకెళ్లలో మగ్గాల్సి వచ్చిందని జాగృతి అసోసియేట్ ఎడిటర్ కుర్ర దుర్గారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ప్రారంభిక్ శిక్ష వర్గ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. హిందువులు జరుపుకొనే పండుగల్లో దసరా ప్రత్యేకమైనదన్నారు. హిందువుల సంఘటితంలోనే జాతి మనుగడ ఉంటుందన్నారు. అనంతరం పట్టణంలో పథసంచాలన్ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, భాజపా నాయకులు సురేష్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ బాధ్యులు రాజన్న, కిషన్, రమేష్, శ్రీనివాస్, ప్రయకరావు, నాగరాజు, సదానందం, దిలీప్‌కుమార్, సతీష్, సాయి పాల్గొన్నారు.



పథసంచాలన్‌లో ఆర్ఎస్ఎస్ సభ్యులు

చెత్త తరలింపు

కమాన్‌పూర్, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని శ్మశానవాటిక సమీపంలో పేరుకుపోయిన చెత్తను ఆదివారం తొలగించారు. గ్రామంలో సేకరించిన చెత్తను డంపు చేయడానికి సరైన స్థలం లేక సిద్దిపల్లికి వెళ్లేదారి పక్కన పడేసేవారు. ఇక్కడే శ్మశానవాటిక ఉండటంతో దహన సంస్కారాలకు వచ్చే వారు.. ఈ దారి గుండా వెళ్లేవారు దుర్గంధంతో ఇబ్బంది పడేవారు. ఈ సమస్యపై ఈనాడులో పలు సార్లు కథనాలు రావడంతో ఎంపీడీవో లలిత, ఎంపీవో భాస్కర్, కార్యదర్శి సింగరేణి అధికారులతో మాట్లాడటంతో జూలపల్లి పరిధి ముల్కలపల్లి సౌర విద్యుత్తు కేంద్రం సమీపంలోని స్థలంలో ఆదివారం చెత్తను లారీ, జేసీబీ సహాయంతో తరలించారు. ఇక నుంచి గ్రామంలో సేకరించే చెత్తను అక్కడే డంపు చేస్తామని అధికారులు చెప్పారు.



లారీలో చెత్తను పొక్లెయిన్‌తో తరలిస్తున్న దృశ్యం

వినియోగించారు.. వదిలేశారు!



మండలంలోని పలు గ్రామాల్లో వరి ధాన్యాన్ని తాలు, తప్ప లేకుండా శుభ్రపరచడానికి తూర్పార యంత్రాలను ఏర్పాటుచేసి వినియోగించారు. అయితే భద్రపరచడంలో నిర్లక్ష్యం వహించారు. కన్నాల బోడగుట్టపల్లిలోని ప్యాక్స్ కార్యాలయ సమీపంలోని ఖాళీ ప్రదేశంలో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉన్నాయి. వానకాలం పంట కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేస్తున్న తరుణంలో రైతులు మళ్లీ ఉపయోగించుకునేలా.. యంత్రాలను భద్రపరిచే విషయంలో అధికారులు నిర్లక్ష్యం వీడాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పాలకుర్తి**

ఘనంగా శరన్నవరాత్రోత్సవాలు



ధర్మారం: ఎర్రగుంటపల్లిలో..



సుల్తానాబాద్: పూసాలలో ప్రత్యేక పూజ

జిల్లాలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మండపాల్లోని దుర్గామాతను శాకంబరీ.. లలితా త్రిపుర సుందరి రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంథని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో బతుకమ్మ ఆడారు. కుంకుమ పూజలు, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు చేశారు. భవానీ దీక్షాపరులు, భక్తులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, బృందం**



మంథనిలో బతుకమ్మ



కమాన్‌పూర్: బాపూజీనగర్‌లో అన్నపూర్ణ అవతారంలో అమ్మవారు

నేర వార్తలు

చెరువులో పడి వృద్ధుడు మృతి

ఓదెల, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధుడు మృతి చెందిన ఘటన ఓదెల మండలం కనగర్తిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం కనగర్తికి చెందిన పెరిక మొండయ్య(60) భార్య గతంలోనే మృతి చెందింది. కుమారుడు జీవనోపాధి నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఇంట్లో ఒంటరిగా ఉంటున్న మొండయ్య శనివారం రాత్రి బహిర్భూమికి వెళ్లి కాలు జారీ ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయినట్లు తెలుస్తోంది. ఆదివారం మొండయ్య మృతదేహం చెరువులో కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి కూతురు రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ కిషన్ చెప్పారు.

కిరాణ టేలా పైనుంచి పడి వెల్డర్...



శ్రవణ్‌కుమార్

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు కిరాణ టేలా పై నుంచి పడి వెల్డర్ మృతి చెందిన ఘటన సుల్తానాబాద్ పురపాలక సంఘం పరిధిలోని పూసాలలో ఆదివారం జరిగింది. ఎస్సై నరేష్, బాధిత కుటుంబ సభ్యుల సమాచారం మేరకు పూసాలకు చెందిన కంకణాల శ్రవణ్‌కుమార్(30) వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం సుల్తానాబాద్ బియ్యం మిల్లర్ల సంక్షేమ సంఘం భవనం పక్కనున్న కిరాణ దుకాణం టేలా ఎక్కి ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడ్డాడు. తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా మృతదేహాన్ని సుల్తానాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శ్రవణ్ తల్లి విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి,,,

వెల్గటూరు: జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల పరిధిలోని గుల్లకోట ధాన్యం కొనుగోలు కేంద్రం సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ధర్మారం మండలం సాయంపేటకు చెందిన యువకుడు సాయి మృతి చెందాడు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

139 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

పాలకుర్తి(అంతర్గాం): మండలంలోని కుందనపల్లిలో ఐవోసీఎల్ డిపో సమీపాన ఓ వాహనంలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా జరుగుతుందనే సమాచారం మేరకు.. దాడిచేసి 139 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శనివారం రాత్రి హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, డిప్యూటీ తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. తరలిస్తున్న నక్క జితేంద్రపై 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. వీటి విలువ సుమారు రూ.12 లక్షలు ఉంటుందన్నారు. పట్టుబడిన బియ్యాన్ని పెద్దపల్లి ఎంఎల్ఎం పాయింట్‌కు, వాహనాన్ని అంతర్గాం పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

విహారానికి వచ్చి మృత్యు ఒడిలోకి



అభినవ్

గోదావరిఖని, వాజేడు, న్యూస్‌టుడే: స్నేహితులతో కలిసి సరదాగా జలపాతంలో గడిపేందుకు వచ్చిన గోదావరిఖనికి చెందిన యువకుడు ఆదివారం ములుగు జిల్లా వాజేడు మండలం కొంగాల సమీపంలోని దుసపాటిలొద్ది జలపాతంలో మునిగి మృతిచెందాడు. వాజేడు ఎస్సై హరీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖని పట్టణానికి చెందిన బండారి అభినవ్(19) బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తన స్నేహితులతో కలిసి ఆదివారం ఉదయం దుసపాటిలొద్ది జలపాతానికి చేరుకున్నారు. జలపాతంలో దిగిన అభినవ్ నీటిలోని రాయిపై అడుగువేయగా జారిపోయాడు. స్నేహితులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో.. మత్స్యకారులను, కొంగాల పంచాయతీ సిబ్బందిని సంఘటన స్థలానికి పంపారు. మత్స్యకారులు గాలించి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి బంధువు మురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

20 చరవాణుల రికవరీ

పెద్దపల్లి, న్యూస్‌టుడే: పెద్దపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో పలువురు పోగొట్టుకున్న 20 చరవాణులను రికవరీ చేసినట్లు ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. బాధితులకు ఆదివారం అందజేసినట్లు ఆయన చెప్పారు.

పల్లె ప్రాంతం.. పువ్వులతో ఆదాయం



బతుకమ్మ అలంకరణలో వాడే పువ్వులతో గ్రామీణులు ఆదాయం పొందుతున్నారు. బంతి, పట్ట కుచ్చులు తదితర వాటిని ఇంటి దగ్గర పెంచుతూ కొందరు.. మరికొందరు అటవీ ప్రాంతాల్లోని గునుక, తంగేడు పువ్వులు సేకరించి పట్టణ ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. కమాన్‌పూర్ మండలంలోని పలు గ్రామాల ప్రజలు గుట్ట, అటవీ ప్రాంతాలకు వెళ్లి గునక పువ్వు సేకరించి ఇంటి వద్ద కట్టలు కడతారు. పండుగకు ఒక రోజు ముందు గోదావరిఖని, సింగరేణి ప్రాంతాల్లో విక్రయిస్తారు. కట్ట సైజును బట్టి రూ.5 నుంచి రూ.20 రూపాయలకు అమ్ముతారు. **- న్యూస్‌టుడే, కమాన్‌పూర్**

సంక్షిప్తం

ఓపెన్ స్కూల్ ప్రవేశాల గడువు పొడిగింపు

కమాన్‌పూర్, న్యూస్‌టుడే: ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ ప్రవేశాల దరఖాస్తు గడువు ఈ నెల 31 వరకు పొడగించినట్లు కమాన్‌పూర్ మండల ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ సమన్వయకర్త, స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పది, ఇంటర్ మధ్యలో ఆపేసి వారు, వ్యాపారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు కమాన్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

రేపు ఆదివరాహస్వామి హుండీ లెక్కింపు

కమాన్‌పూర్, న్యూస్‌టుడే: కమాన్‌పూర్‌లోని ఆదివరాహస్వామి హుండీని మంగళవారం లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి కాంతారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు లెక్కిస్తామని.. ఆసక్తి గల భక్తులు, ప్రజలు హాజరుకావాలని కోరారు.

సంఘాలు-నియామకాలు

పెద్దపల్లి: పెద్దపల్లి వ్యాన్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మొహమ్మద్ ఆరిఫ్ అలీ, గౌరవ అధ్యక్షుడిగా మస్రత్, ప్రధాన కార్యదర్శిగా బాలాజీ సింగ్, ఉపాధ్యక్షుడిగా అజయ్, జాయింట్ సెక్రటరీగా చంద్రబాబులు ఆదివారం ఎన్నికయ్యారు.

కమాన్‌పూర్: కమాన్‌పూర్ మండల ఆటో జేఏసీ అధ్యక్షుడిగా కందుల నర్సింగం, ఉపాధ్యక్షులుగా సంకరి కుమారస్వామి, సుంకిత సదయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తాటికొండ కనకయ్య, సంయుక్త కార్యదర్శుడిగా చిగురు మొండయ్య, ప్రచార కార్యదర్శులుగా కేసెట్టి రమేశ్, ఆకుల రాజు, మండల కార్యవర్గ సభ్యులుగా సుంచ శ్రీనివాస్, తౌసీద్, మల్లేష్, కొమురయ్య, శంకర్, జావిద్‌లను ఎన్నుకున్నారు. జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్, జిల్లా ఇన్‌ఛార్జి కాశీపేట రాజయ్యల పాల్గొన్నారు.

పాలకుర్తి(అంతర్గాం): మండలంలోని సోమన్‌పల్లి గ్రామంలో ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘ గ్రామ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు బాపయ్య అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసినంతరం గ్రామ అధ్యక్షుడిగా కుమారస్వామి, ఉపాధ్యక్షులుగా సాగర్, రమేష్, కోశాధికారిగా చిన్నా, కార్యదర్శిగా నర్సయ్య, అధికార ప్రతినిధిగా ప్రసాద్‌లను ఎన్నుకున్నారు.

ధర్మారం: మండలంలోని దొంగతుర్తి గౌడ యువజన సంఘం అధ్యక్షుడిగా పాలకుర్తి ప్రశాంత్, ఉపాధ్యక్షులుగా బండి శ్రీకాంత్, రంగు నరేష్, ప్రధాన కార్యదర్శిగా బొంగాని అరుణ్, కోశాధికారిగా అమరగోని మహేష్, సంయుక్త కార్యదర్శిగా పల్లె చందు, కార్యవర్గ సభ్యులుగా ఆరుగురిని ఆదివారం ఎన్నుకున్నారు. గౌడ సంఘం అధ్యక్షుడు ముక్కెర ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

మహిళకు రక్తదానం

యైటింక్లయిన్‌కాలనీ: మంచిర్యాల జిల్లాకు చెందిన తారాబాయ్ అనే మహిళ రక్తకణాల లేమీ సమస్యతో ప్రాణాపాయ స్థితికి వచ్చిన విషయం తెలుసుకొని.. కాలనీకి చెందిన యువకుల సేవా సంఘం సభ్యులు రక్తదానం చేసి ఆమె ప్రాణాలు కాపాడారు. సభ్యులు అనిల్, దుర్గంసాయి, వినీత్‌లు.. ఆదివారం రక్తదానం చేసి ఆమె ప్రాణాలు కాపాడారు. పలువురు వారిని అభినందించారు

ప్రతిభా పురస్కారాల పంపిణీ

గోదావరిఖని: పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 9న గోదావరిఖనిలోని మార్కండేయకాలనీలో విద్యార్థులకు జిల్లాస్థాయి ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు.. సంఘం నాయకులు రాజేశం, లక్ష్మీనర్సయ్య, శంకర్, సంపత్ తదితరులు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, పోలీసు కమిషనర్ చేతులమీదుగా పురస్కారాలను అందజేస్తామన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఎంసెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు ధ్రువపత్రాలతో హాజరు కావాలన్నారు.

షీ బృందం సేవలపై అవగాహన

జ్యోతినగర్(మార్కండేయకాలనీ): మహిళ రక్షణ, మత్తు పదార్థాల నియంత్రణ, ఆన్‌లైన్ మోసాలపై పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉందని షీ బృందం బాధ్యులు, ఏఎస్సై మల్లన్న, సభ్యులు స్నేహలత‌లు అన్నారు. ఎన్టీపీసీ కృష్ణానగర్‌లో ఆదివారం ఓ న్యూట్రిషన్ అండ్ ఫిట్‌నెస్ కేంద్రంలో షీ బృందం సేవలపై మహిళలకు అవగాహన కలిగించారు. సమస్య ఎదురైతే 1930 నంబకు సమాచారం ఇవ్వాలన్నారు.

మసీద్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

పాలకుర్తి(రామగుండం): 20వ డివిజన్ రైల్వేస్టేషన్ ప్రాంతంలో నిర్మించిన మసీద్‌ను ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలతోపాటు స్థానిక కార్పొరేటర్ సతీష్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

రహదారి వెంట చెట్ల తొలగింపు

కాల్వశ్రీరాంపూర్, న్యూస్‌టుడే: మండలంలోని ఇద్లాపూర్-జాఫర్‌ఖాన్‌పేట రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను మాజీ ఎంపీపీ సారయ్య జేసీబీ, ట్రాక్టర్ సహాయంతో ఆదివారం తొలగించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని గ్రామస్థులు సారయ్యకు విన్నవించగా ఆయన ఎమ్మెల్యే విజయరమణారావు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలను, వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉన్న చెట్లను తొలగించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సదయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షల శిబిరానికి స్పందన

గోదావరిఖని: ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి పరీక్షల శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక 32వ డివిజన్‌లో శిబిరం నిర్వహించారు. పరీక్షలు చేయించుకున్న వారిలో 220 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. వారికి దసరా తర్వాత ఉచితంగా శస్త్రచికిత్సలు చేయిస్తామని ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. ప్రతినిధులు ప్రశాంత్, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

మంథని, న్యూస్‌టుడే: మంథనిలో సోమవారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏఈఈ మల్లయ్య తెలిపారు. పట్టణంలోని విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలో మరమ్మతుల కోసం సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. పద్మశాలివీధి, పెంజేర్వుకట్ట, స్టేట్‌బ్యాంకు ఏరియాలో ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

దుర్గామాత మండపంలో అన్నదానం

పాలకుర్తి: దుర్గామాత శరన్నవరాత్రులను పురస్కరించుకొని మండలంలోని పుట్నూరు గ్రామంలో దుర్గామాత కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. కేశోరాం గుర్తింపు సంఘం అధ్యక్షుడు కౌశికహరి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయ అభివృద్ధికి కృషి

ఓదెల, న్యూస్‌టుడే: శ్రీ మల్లికార్జునస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నామని దేవస్థాన కమిటీ ఛైర్మన్ మేకల మల్లేష్ యాదవ్ అన్నారు. దేవాలయ కార్యాలయంలో ఆదివారం పాలకవర్గం సభ్యులతో ఆయన సమావేశమై మాట్లాడారు. ఆలయ ఆవరణలో నూతనంగా బంగారు పోచమ్మ, మదన పోచమ్మ ఆలయాలను, కోనేరు నిర్మాణాలను చేపట్టామన్నారు. దాతల సహకారంతో హైమాస్ట్ లైట్లు, వసతి గదుల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. దేవాదాయ శాఖ అనుమతితో రథం, రెండు షెడ్లు, మరుగుదొడ్లు తదితర వసతులు ఏర్పాటు చేశామన్నారు. ఆలయ భూములను రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి హద్దురాళ్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఆలయ కమిటీ పాలక వర్గం సభ్యులు పాల్గొన్నారు.

